## ఒలింపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా..

### స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి క్రీడా విభాగాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దేశ క్రీడారంగానికి తెలంగాణ కేంద్ర బిందువుగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని క్రీడాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన భేటీలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ఫోర్త్ సిటీలో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ యూనివర్సిటీపై ఆయన వారితో చర్చించారు. 'యంగ్‌ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ప్రతి క్రీడకు ప్రాధాన్యం ఉండాలి. అన్ని రకాల క్రీడలు, శిక్షణా సంస్థలను ఒకే గొడుగు కిందికి తీసుకురావాలి. మన దేశంతో పాటు తెలంణాలో భౌగోళిక పరిస్థితుల ఆధారంగా శరీర నిర్మాణ తీరుకు అనుగుణంగా వారిని గుర్తించి ఆయా క్రీడల్లో ప్రోత్సహించాలి. ఒలింపిక్స్‌లో దేశం తరపున పతకాలు సాధించే విధంగా వారిని తీర్చిదిద్దాలి. ఇందుకోసం నిపుణులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పించాలి' అని అన్నారు. మరోవైపు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో క్రీడా విభాగాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలోని క్రీడా పాఠశాలలు, శిక్షణా సంస్థలన్నింటినీ స్పోర్ట్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని సీఎం సూచించారు. ఇటీవల పతకాలు సాధించిన ఆయా దేశాల ప్లేయర్లు, వారి నైపుణ్య శిక్షణపై సమగ్ర అధ్యాయనం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## జ్వెరెవ్‌కు సిన్నర్ షాక్

### సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో ఇటలీ కుర్రాడు



మసాన్(యూఎస్): ప్రతిష్టాత్మక యూఎస్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న సిన్సినాటి ఓపెన్‌లో ఇటలీ కుర్రాడు జన్నిక్ సిన్నర్ అదరగొడుతున్నాడు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ మొదటి ర్యాంకులో ఉన్న అతడు సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో 7-6 (11/9), 5-7, 7-6 (7/4)తో జర్మనీ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్‌ను ఓడించాడు. జ్వెరెవ్‌తో ఆడిన ఆరు మ్యాచ్‌లలో రెండు మాత్రమే నెగ్గిన సిన్నర్‌కు ఆఖరి నాలుగు సార్లూ నిరాశే ఎదురైంది. కానీ సెమీస్‌లో మాత్రం పట్టుదలగా ఆడిన అతడు ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. మరో సెమీస్‌లో ఫ్రాన్సెస్ టియాఫో(అమెరికా) 4-6, 6-1, 7-6 (7/4)తో హోల్గర్ రునె (డెన్మార్క్)ను చిత్తు చేసి సిన్నర్‌తో అమీతుమీకి సిద్ధమయ్యాడు. మహిళల సింగిల్స్ సెమీస్‌లో ప్రపంచ నంబర్ వన్ ఇగా స్వియాటెక్ (పోలండ్)ను అరీనా సబలెంక ఓడించింది.

## ఓవల్‌దే 'ది హండ్రెడ్' ట్రోఫీ

### ఫైనల్‌లో సౌథర్న్ బ్రేవ్‌పై జయభేరి




లండన్: సుమారు నెల రోజులుగా యూకే వేదికగా క్రికెట్ అభిమానులను అలరిస్తున్న 'ది హండ్రెడ్' నాలుగో ఎడిషన్ విజేతగా 'ఓవల్ ఇన్విన్సిబుల్స్' నిలిచింది. 2024 ఎడిషన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన సామ్ బిల్లింగ్ సారథ్యంలోని ఓవల్.. టైటిల్‌ను నిలబెట్టుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన ఓవల్.. వంద బంతుల్లో 9 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసింది. ఓపెనర్ విల్‌జాక్స్ (37), సామ్ కరన్ (25), జోర్డాన్ కాక్స్ (25) రాణించారు. మోస్తరు లక్ష్య ఛేదనలో సౌథర్న్ బ్రేవ్ తడబడింది. ఆ జట్టు వంద బంతుల్లో 130-7 వద్దే ఆగిపోయి 17 పరుగుల తేడాతో ఓటమిని మూటగట్టుకుంది. ఓపెనర్లు అలెక్స్ డేవిస్ (35), జేమ్స్ విన్స్ (24) తొలి వికెట్‌కు 58 పరుగులు జోడించినా ఓవల్ స్పిన్నర్లు ఆడమ్ జంపా (2/26), సకిబ్ మహ్మద్ (3/17) కట్టడి చేయడంతో ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. ఓవల్‌కు ఇది వరుసగా రెండో హండ్రెడ్ టైటిల్. కాగా మహిళల 'హండ్రెడ్' ట్రోఫీని లండన్ స్పిరిట్స్ సొంతం చేసుకుంది.

# బరువు బాధ్యత అథ్లెట్లదే

### కాస్ పూర్తిస్థాయి తీర్పు వెల్లడి

### 24 పేజీలతో సమగ్ర వివరణ



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ అనర్హత వేటుపై అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం(కాస్) పూర్తి స్థాయి తీర్పును వెలువరించింది. ఈనెల 14న ఏకవాక్య తీర్పునిచ్చిన కాస్ సోమవారం పూర్తి స్థాయి అంశాలను ప్రస్తావించింది. ఏకంగా 24 పేజీల సుదీర్ఘ వివరణలతో అనర్హతకు దారితీసిన కారణాలను నిబంధనలతో సహా వివరించింది. దీనికి తోడు రెజ్లర్ వినేశ్ ఫోగాట్ కేసులో అంశాలన్నింటినీ ప్రస్తావించింది. ముఖ్యంగా నిర్దేశిత బరువు ప్రమాణాలనేవి అథ్లెట్ల బాధ్యత అంటూ తీర్పులో స్పష్టంగా పేర్కొంది. రెండో రోజు బరువు లెక్కింపులో కేవలం 100 గ్రాముల తేడాతో 50కిలోల ఫైనల్ పోరుకు వినేశ్ అర్హత కోల్పోవడం ఒక రకంగా క్రూరమైనదిగా ప్రస్తావించింది.

**తీర్పు సారాంశం ఇది:**

కాస్ తన తుది తీర్పులో అన్ని అంశాలను వివరంగా ప్రస్తావించింది. ముఖ్యంగా నిర్దేశిత బరువు విషయంలో అంతర్జాతీయ రెజ్లింగ్ సంఘం(యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం(ఐవోసీ) నిబంధనలను పేర్కొంది. అర్బిట్రార్ ఈ కేసు విషయాన్ని ప్రస్తావిస్తూ 'ఆమె(వినేశ్) 50కిలోల విభాగంలో పోటీపడుతున్నప్పుడు అందుకు తగ్గట్లు బరువు ఉండాలన్న సంగతి తెలిసే ఉంటుంది. ఎందుకంటే ఆమె చాలా ఏండ్లుగా రెజ్లింగ్‌లో వివిధ విభాగాల్లో పోటీపడుతున్నది. ఆ మాత్రం తెలియకుండా ఉండటానికి లేదు. అందుకు విరుద్ధంగా ఎలాంటి ఆధారాలు కూడా లేవు. బరువు నిబంధనలు అర్థం చేసుకోలేని స్థితిలో కూడా ఆమె లేదు. ఫోగాట్ స్వచ్ఛందంగా 50కిలోల విభాగంలో పోటీపడాలని అనుకున్నప్పుడు అందుకు తగ్గట్లు బరువును అదుపులో ఉంచుకోవాల్సింది. బరువు తగ్గించుకునేందుకు సమయం సరిపోలేదని చెప్పడం సరికాదు. ఆమె శరీర బరువు విషయంలో ఎవరూ కలుగజేసుకోలేదు. ఆర్టికల్ 7 ప్రకారం ఎవరైనా బరువు అనుకూలంగా ఏదైనా ఒక విభాగంలో పోటీపడేందుకు అర్హులు' అని పేర్కొంది. ఇదిలా ఉంటే క్యూబా రెజ్లర్‌తో కలిపి సంయుక్తంగా రజత పతక విజేతగా ప్రకటించాలన్న వినేశ్ అభ్యర్థనను కూడా కాస్ కొట్టివేసింది.

**అనర్హత వేటు ఇలా:**

పారిస్ ఒలింపిక్స్‌లో ఈనెల 7న మహిళల 50కిలోల ఫ్రీస్టయిల్ బౌట్‌లో స్టార్ రెజ్లర్ వినేశ్ బరిలోకి దిగింది. తొలి రోజు మొత్తం మూడు బౌట్లలో వినేశ్ పోటీపడింది. తన తొలి బౌట్‌లో గత పదేండ్లలో ఓటమి ఎరుగని జపాన్ దిగ్గజ రెజ్లర్ యుయి సుసాకీపై సంచలన విజయం సాధించింది. అయితే మరుసటి రోజు ఉదయం జరిపిన బరువు పరీక్షల్లో వినేశ్ 100 గ్రాములు ఎక్కువ ఉన్నట్లు తేలింది. దీంతో అధికారులు ఫోగాట్‌పై వేటు వేస్తూ ఆమె చేతిలో సెమీస్‌లో ఓడిన క్యూబా రెజ్లర్‌కు ఫైనల్లో ఆడే అవకాశం కల్పించారు. దీనిపై వినేశ్..కాస్‌లో అప్పీల్ చేయగా, ఆమెకు భారత ఒలింపిక్ సమాఖ్య(ఐవోఏ)మద్దతుగా నిలిచి కేసు వాదించేందుకు న్యాయవాదులను నియమించింది. మూడు సార్లు వాయిదా వేసిన కాస్.. ఈనెల 14న తీర్పు ఇచ్చింది. గత శనివారం స్వదేశానికి చేరుకున్న వినేశ్‌కు అభిమానులు ఘన స్వాగతం పలికిన సంగతి తెలిసిందే.

## వినేశ్‌కు రూ.16 కోట్ల నగదు!

### మాకు ఒక్క రూపాయి అందలేదన్న భర్త సోమ్‌వీర్.. సోషల్ మీడియాలో వివరణ

బలాలి (హర్యానా): భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు పలు రాజకీయ పార్టీలు, వ్యాపారవేత్తలు, సంస్థల నుంచి రూ. 16.35 కోట్ల నగదు బహుమతులు అందాయని వస్తున్న వార్తలపై ఆమె భర్త సోమ్‌వీర్ రాటీ స్పందించాడు. అవన్నీ 'ఫేక్ న్యూస్' అని కొట్టిపారేశాడు. తన 'ఎక్స్' ఖాతా వేదికగా సోమ్‌వీర్ స్పందిస్తూ.. 'వినేశ్ ఫోగాట్‌కు ఏ రాజకీయ పార్టీ నుంచి గానీ వ్యాపారవేత్తలు, కంపెనీలు, సంస్థల నుంచి గానీ ఒక్క రూపాయి అందలేదు. మీరంతా మా క్షేమం కోరుకునేవారు. దయచేసి ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దు. వాటితో మాకు నష్టం వాటిల్లడమే గాక సామాజిక విలువలకూ నష్టమే' అని రాసుకొచ్చాడు. ఈ మేరకు ట్వీట్‌లో ఎవరి వద్ద నుంచి ఎంతెంత వచ్చిందన్న వార్తలనూ ఆయన కొట్టిపారేస్తూ దానిని 'చీప్ పాపులారిటీ'గా అభివర్ణించాడు.

## వినేశ్‌కు 'స్వర్ణం' ఇవ్వనున్న ఖాప్ పంచాయితీలు!

పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ పోరుకు ముందు 100 గ్రాముల అదనపు బరువు ఉన్న వినేశ్ పతకాన్ని కోల్పోయినా హర్యానాలో 'ఖాప్ పంచాయితీ'లు మాత్రం ఆమెకు 'స్వర్ణ పతకం' అందించేందుకు సిద్ధమయ్యాయి. ఇదే విషయమై సంగ్వాన్ ఖాప్ అధ్యక్షుడు, హర్యానాలో స్వతంత్ర ఎమ్మెల్యే అయిన సోంబిర్ సంగ్వాన్ మాట్లాడుతూ.. 'ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచే విజేతలకు అందించే పసిడి పతకాన్ని పోలిన బంగారు పతకం వినేశ్‌కు అందజేస్తాం. ఫైనల్ మ్యాచ్‌కు ముందు ఆమె అనర్హత వేటును ఎదుర్కోవడం అనేది సహించరానిది. దీని వెనుక కుట్ర దాగి ఉంది. పతకం రాకపోయినప్పటికీ వినేశ్ దేశ ప్రజల హృదయాలను గెలుచుకుంది' అని అన్నాడు. వినేశ్‌కు స్వర్ణ పతకం అందించే వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఖాప్ పంచాయితీ సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

## బంగ్లాలో వరల్డ్‌కప్ కరెక్ట్ కాదు!-అలిస్సా హీలీ

సిడ్నీ: గత కొంతకాలంగా బంగ్లాదేశ్‌లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఆ దేశంలో టీ20 ప్రపంచకప్ నిర్వహించడం సరికాదని ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు సారథి అలిస్సా హీలీ భావిస్తోంది. ప్రస్తుతం బంగ్లాలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం కంటే దృష్టిసారించాల్సిన అంశాలు చాలా ఉన్నాయని తెలిపింది. 'క్రికెట్.కామ్.ఏయూ'తో హీలీ మాట్లాడుతూ.. 'ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉన్న పరిస్థితుల దృష్ట్యా అక్కడ ఆడటం సరికాదు. ఆ దేశంలో ప్రజలు సాయం కోసం అర్థిస్తున్న తరుణంలో వారి దగ్గరకు వెళ్లి ఉన్న వనరులనూ వాడుకోవడం సమంజసం కాదు. ప్రస్తుత పరిస్థితులలో అక్కడ క్రికెట్ టోర్నీ నిర్వహణ కంటే దృష్టి సారించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. అయితే ఈ విషయంలో ఐసీసీదే తుది నిర్ణయం' అని తెలిపింది.

## నాగల్ ఔట్



విన్స్‌టన్ సేలం (నార్త్ కరోలినా): యూఎస్‌ఏలోని నార్త్ కరోలినా వేదికగా జరుగుతున్న విన్స్‌టన్ సేలం ఏటీపీ 250 టోర్నీలో భారత టాప్ ర్యాంకు టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నాగల్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో నాగల్ 4-6, 2-6తో బొర్న కోరిచ్(క్రొయేషియా) చేతిలో పరాభవం పాలయ్యాడు. గంటా పది నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌లో కాస్త ప్రతిఘటించిన నాగల్ రెండో సెట్‌లో మాత్రం చేతులెత్తేశాడు.

## పంకజ్ డబుల్ ధమాకా



ముంబై: భారత స్టార్ క్యూయిస్టు పంకజ్ అద్వానీ డబుల్ ధమాకాతో అదరగొట్టాడు. వెస్టర్న్ ఇండియా బిలియర్డ్స్, స్నూకర్ చాంపియన్‌షిప్‌లో సీనియర్ టైటిల్ విజయంతో ఆకట్టుకున్నాడు. సోమవారం జరిగిన ఫైనల్లో పంకజ్ 6-4తో కమల్‌చావ్లా(ఈస్ట్ రైల్వేస్)ను ఓడించాడు. తొలుత జరిగిన బిలియర్డ్స్ ఫైనల్లో అద్వానీ..జోల్టన్ జకో(హంగరీ)పై గెలిచి టైటిల్ సొంతం చేసుకున్నాడు.

## వారికెందుకు విశ్రాంతి?

### దులీప్ ట్రోఫీలో రోహిత్, కోహ్లీ లేకపోడంపై గవాస్కర్ గుస్సా

ముంబై: దేశవాళీ టోర్నీలో దులీప్ ట్రోఫీ నుంచి స్టార్ క్రికెటర్లు రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లీకి మినహాయింపు ఇవ్వడంపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాడు. సోమవారం మీడియాతో సన్నీ మాట్లాడుతూ 'సెప్టెంబర్ 5 నుంచి దులీప్ ట్రోఫీ మొదలవుతున్నది. ఇందులో పలువురు టీమ్ఇండియా ప్లేయర్లు ఉన్నారు. కానీ సీనియర్లు రోహిత్, కోహ్లీ, అశ్విన్, బుమ్రాకు విశ్రాంతినిస్తూ దేశవాళీలో రాణిస్తున్న ప్లేయర్లకు అవకాశమిచ్చారు. బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు ముందు దులీప్ ట్రోఫీలో ఆడాల్సిన రోహిత్, కోహ్లీకి విశ్రాంతినివ్వడం సరైంది కాదు. జూన్ 28న టీ20 ప్రపంచకప్ ఫైనల్ ఆడిన వీరిద్దరు, శ్రీలంకతో మూడు వన్డేలు ఆడారు. ఆ తర్వాత 40 రోజుల పాటు పూర్తి ఆటకు దూరంగా ఉండి..బంగ్లాతో సిరీస్ ఆడనున్నారు. మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా నేరుగా టెస్టులు ఆడటం మంచి పద్ధతి కాదు' అని అన్నాడు. రానున్న రోజుల్లో వరుస సిరీస్‌లను దృష్టిలో పెట్టుకుని స్పీడ్‌స్టర్ బుమ్రాకు విశ్రాంతినివ్వడాన్ని అర్థం చేసుకోవచ్చని సన్నీ పేర్కొన్నాడు.

## సెమీస్‌లో రోనక్



అమ్మన్(జోర్డాన్): అండర్-17 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్ రోనక్ దహియా సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. సోమవారం జరిగిన 110కిలోల గ్రీకో రోమన్ విభాగం క్వార్టర్స్‌లో రోనక్ 8-1తో ఆర్థర్ మాన్వలిన్‌పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన దూకుడు కొనసాగించిన రోనక్ తన తదుపరి పోరులో హంగరీకి చెందిన జొల్టన్ జాకోతో తలపడుతాడు. మరోవైపు 80కిలోల కేటగిరీలో నిశాంత్ ఫోగాట్ 7-1తో మహమ్మద్ అబాదీ(అల్జీరియా)పై గెలిచి ముందంజ వేశాడు.




Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078. Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.